ఇక్ష్వాకులు

ఇక్ష్వాకులు

శాతవాహనుల తర్వాత క్రీ.శ.2వ శతాబ్దంలో విజయపురి (నాగార్జున కొండ ప్రాంతం) రాజధానిగా చేసుకొని, కృష్ణా, గుంటూరు ప్రాంతాన్ని ఇక్ష్వాకులు పాలించారు. వీరిని శ్రీ పర్వతీయులు, ఆంధ్రులు అని పురాణాలు పేర్కొన్నాయి.

ఇక్ష్వాకుల రాజవంశ చరిత్ర తెలుసుకోవడానికి ప్రాకృత శాసనాలు ముఖ్య ఆధారాలు. ఇవి ఆంధ్రదే శంలో రెంటాల, కేసనపల్లి వద్ద ఛాంతమూలుని శాసనాలు; వీర పురుషదత్తుని నాగార్జునకొండ శాసనం, వేదశ్రీ, కోడబలి శ్రీ, శాంతిశ్రీల నాగార్జున కొండ శాసనాలు గుంటూరు జిల్లాలో లభ్యమయ్యాయి. ఈ శాసనాలన్నీ బ్రహ్మలిపి, ప్రాకృత భాషలో ఉన్నాయి.

ఇక్ష్వాకు వంశ రాజ్యస్థాపకుడు 'వాశిష్టీపుత్ర శ్రీ శాంతమూలుడు' (క్రీ.శ 200–218). ఈ వంశంలో మొత్తం ఏడుగురు రాజులు వందేళ్లు పాలించారు. ఈ వంశంలో సుప్రసిద్ధుడు శ్రీ వీరపురుషదత్తుడు. ఇక్ష్వాకుల్లో చివరి రాజు రుద్రపురుషదత్తుడు. శ్రీ వీరపురుషదత్తు కాలంలోనే నాగార్జునకొండలో సింహళ బౌద్ధ యాత్రికుల కోసం 'సింహళ విహారాన్ని' నిర్మించాడు. ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండ, ఉప్పు-గుండూరు, జగ్గయ్యపేట, అల్లూరు శాసనాలు చారిత్రక ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఇక్ష్వాకుల తొలిశాసనాలను ప్రాకృత భాషలో, మలిశాసనాలను సంస్కృతభాషలో లిఖించారు.

రాజ్యాన్ని గ్రామపంచిక, మహాగ్రామ అని విభజించారు. వీరి కాలంలో న్యాయాధికారులను 'మహాతలవరులు'గా వ్యవహరించే వారు. వీరితో పాటు మహాసేనాపతులు, మహాదండనాయకులు రాష్ట్ర పాలకులుగా ఉండేవారు. వీరి కాలంలో సువర్ణం, దీనార్ మారకం వంటి నాణేలు చలామణిలో ఉండేవి.

ఇక్ష్వాకులు బౌద్ధనిర్మాణాలతో పాటు, హిందూ దేవాలయాలనూ నిర్మించారు. వీరి కాలంనాటి పుష్పభద్రస్వామి, అష్టభుజస్వామి దేవాలయాలు, నాగార్జునకొండ వద్ద అవశేషాలు లభించాయి. ఇక్ష్వాకుల చివరి రాజైన రుద్రపురుషదత్తుని శాసనాలు నాగార్జున కొండ, గురజాల ప్రాంతాల్లో లభించాయి. రుద్రపురుషదత్తునితో ఇక్ష్వాకుల వంశం పతనం ప్రారంభమైంది. కంచిలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన తొలి పల్లవులు రుద్రపురుషదత్తుని వధించి, రాజ్యాన్ని ఆక్రమించారు.

మోడల్ ప్రశ్నలు

1. శ్రీ వీర పురుషదత్తుడు ఏ వంశానికి చెందిన వాడు?

ఎ) రాష్ట్ర కూటులు బి) చాళుక్యులు
సి) ఇక్ష్వాకులు డి) శాలంకాయనులు

2. తొలి హిందూదేవాలయాన్ని నిర్మించిన రాజ వంశం?

ఎ) విష్ణుకుండినులు బి) శాలంకాయనులు
సి) బృహత్పలాయనులు డి) ఇక్ష్వాకులు

3. ఇక్ష్వాకుల రాజధాని?

ఎ) విజయపురి బి) అమరావతి
సి) వేంగి డి) భట్టిప్రోలు

4. పశ్చిమగోదావరి జిల్లాలోని 'గుంటుపల్లి చైత్యగృహాన్ని' ఏ రాజ వంశం నిర్మించింది?

ఎ) శాతవాహనులు బి) ఇక్ష్వాకులు
సి)బృహత్పలాయనులు డి) శాలంకాయనులు

5. శ్రీ పర్వతం(నాగార్జునకొండ) విశ్వవిద్యాలయం మహాక్షేత్రంగా ఏ ఇక్ష్వాకు రాజు కాలంలో వర్ధిల్లింది?

ఎ) శ్రీ వీరపురుషదత్తుడు
బి) ఎహువల శాంతమూలుడు
సి) రుద్రపురుషదత్తుడు
డి) శ్రీ శాంతమూలుడు

6. సింహళ థేరవాదులకు 'సింహళవిహారాన్ని' ఎక్కడ నిర్మించారు?

ఎ) అమరావతి బి) జగ్గయ్యపేట
సి) నాగార్జునకొండ డి) భట్టిప్రోలు

సమాధానాలు: 1-సి, 2-డి, 3-ఎ,4-బి,5-ఎ,6-సి

నోట్: అదేవిధంగా చైత్యగృహం, మహాభినిష్క్రమణం, హీనయానం, మహాయానం అంటే ఏమిటి అనే అంశాలపై గతంలో ప్రశ్నలు అడిగారు

బృహత్పలాయనులు

ఇక్ష్వాకుల పతనాంతరం తూర్పు ఆంధ్రదేశాన్ని పాలించిన రాజవంశం బృహత్పలాయనులు. వీరు క్రీశ మూడో శతాబ్దం ఉత్తరార్ధంలో గూడూరు(కోడూరు) రాజధానిగా కృష్ణాజిల్లా ప్రాంతాన్ని పాలించారు. వీరి గురించి తెలిపే ఒక శాసనం 'కొండముది తామ్రశాసనం'. దీని ప్రకారం 'జయవర్మ' అనే రాజు బృహత్పలాయనుల వంశస్థాపకుడు. ఈ శాసనాన్ని ప్రాకృత భాషలో లిఖించారు. గుంటూరు జిల్లాలోని తెనాలి సమీపంలో ఉన్న గ్రామం 'కొండముది'. వీరి రాజధాని కూదూరు. గూడూరుగా పేర్లు సంతరించుకుంది. కూదూరును ప్రస్తుతం మచిలీపట్నం తాలూకాలోని గూడూరుగా చరిత్రకారులు గుర్తిస్తున్నారు. జయవర్మ పల్లవుల చేతిలో ఓడిపోయాడు.

1. బృహత్పలాయనుల రాజ్యస్థాపకుడెవరు?

ఎ) జయవర్మ బి) ఇంద్రవర్మ
సి) మాధవవర్మ డి) దేవవర్మ

2. బృహత్పలాయనుల వంశ చరిత్రను తెలిపే ఒకే ఒక శాసనం పేరు?

ఎ) నాగార్జునకొండ బి) కొండముది తామ్ర
సి) భట్టిప్రోలు డి) అమరావతి

3. బృహత్పలాయన జయవర్మ కొండముది తామ్రశాసనం లిఖించిన భాష?

ఎ) ప్రాకృత బి) తెలుగు

సి) కన్నడ డి) సంస్కృతం

సమాధానాలు: 1-ఎ, 2-బి,3-ఎ

శాలంకాయనులు

బృహత్పలాయనుల తర్వాత అధికారంలోకి వచ్చినవారు శాలంకాయనులు. వీరు క్షత్రియ ధర్మాన్ని స్వీకరించిన బ్రాహ్మణులు. విజయదేవ వర్మ రాజ్యస్థాపకుడు. ఈయన ఆనందగోత్రికులను ఓడించి, కృష్ణానది ఉత్తర భాగాన్ని ఆక్రమించాడు. వీరి రాజధాని వేంగి. రాజ లాంఛనం వృషభం. వీరు చిత్రరథస్వామి భక్తులు. శాలంకాయన రాజుల్లో హస్తివర్మ ప్రసిద్ధుడు. సముద్రగుప్తుడు దక్షిణ దేశ దండయాత్రకు వచ్చి హస్తివర్మను ఓడించినట్లు అలహాబాద్ స్తంభ శాసనాల ద్వారా తెలుస్తోంది. శాలంకాయన రాజుల్లో చివరివాడు విజయ స్కంధ వర్మ తర్వాత వీరి రాజ్యాన్ని విష్ణుకుండినులు ఆక్రమించారు.

శాలంకాయనులు వేయించిన ఎనిమిది శాసనాల్లో రెండోది నంది వర్మ వేయించిన పెదవేగి శాసనం ఆంధ్రదేశంలో విష్ణుదేవాలయం గురించి విశదీకరిస్తుంది. వీరి శాసనాల్లో ఏలూరు, కొల్లేరు, గుంటుపల్లి శాసనాలు ముఖ్యమైనవి.

శాలంకాయనులు సంస్కృత భాషను రాజభాషగా గుర్తించారు. వీరి కాలంలో వేంగి గొప్ప విద్యాకేంద్రంగా వర్ధిల్లింది. ఆంధ్రసంస్కృతిని తూర్పుదేశాలకు విస్తరించారు.

బౌద్ధ పండితులు

బుద్ధపాలితుడు, భావవివేకుడు, ఆచార్యదిగ్నాగుడు వంటి పండితులు మహాయాన బౌద్ధ మత వ్యాప్తికి విశేష కృషిచేశారు. దిగ్నాగుడు ''శుద్ధ ఆర్యవిద్య''కు పునాది వేశాడు.

మోడల్ ప్రశ్నలు

1. **శాలంకాయనుల ఆరాధ్యదైవం?**

ఎ) చిత్రరథస్వామి(సూర్యుడు) బి) ఇంద్రుడు

సి) నంది డి) విష్ణువు

2. **శాలంకాయనుల రాజ్యస్థాపకుడు?**

ఎ) విజయదేవవర్మ బి) హస్తి వర్మ

సి) విజయనందివర్మ డి) స్కందవర్మ

3. **శాలంకాయనుల రాజలాంఛనం?**

ఎ) నంది బి) గరుత్మంతుడు

సి) వృషభం డి) చేప

సమాధానాలు: 1-ఎ, 2-ఎ, 3-సి,

ఆనంద గోత్రీయులు

వీరు గుంటూరు మండలాన్ని పాలించినట్లు తెలుస్తోంది. వీరి రాజధాని కందరపురం. శాలంకాయనులకు సమకాలికులు. వీరిని 'కందర రాజులు' అని కూడా పిలుస్తారు. ఈ వంశంలో దామోదర వర్మ వేయించిన 'మట్టిపాడు', అత్తివర్మ వేయించిన 'గోరంట్ల', కందరుడు వేయించిన చేజెర్ల శాసనాలు ప్రధానమైనవి. వీరు మొదట బౌద్ధ కులస్థులు. తర్వాత శైవాన్ని స్వీకరించారు. వీరి కాలంలోనే సుప్రసిద్ధ కపోతేశ్వరాలయం నిర్మించారు.

మోడల్ ప్రశ్నలు

1. **చేజెర్లలోని కపోతేశ్వర ఆలయాన్ని ఏ ఆనంద గోత్రీయుల రాజు నిర్మించాడు?**

ఎ) దామోదర వర్మ బి) అత్తివర్మ

సి) కందర వర్మ డి) మహేశ్వరవర్మ

2. **ఆనంద గోత్రీయుల రాజధాని?**

ఎ) కందరపురం బి) చేజర్ల

సి) భట్టిప్రోలు డి) వేంగి

సమాధానాలు: 1-ఎ, 2-ఎ

విష్ణుకుండినులు

క్రీశ 5వ శతాబ్దం నుంచి 7వ శతాబ్దం వరకు విష్ణుకుండినులు ఆంధ్రదేశాన్ని పాలించారు. మొదట మాధవ వర్మ ఈ రాజ్య స్థాపకుడు. వినుకొండ వీరి జన్మభూమి. వీరి చరిత్రను పునర్నిర్మించడానికి గోవింద వర్మ వేయించిన 'ఈపురు', విక్రయేంద్ర భట్టారక వర్మ వేయించిన తుండి, చిక్కుళ్లగూడెం శాసనాలు ముఖ్యమైనవి. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని 'చైతన్యపురి' ప్రాంతంలో వీరి కాలానికి చెందిన శాసనం లభించింది. విష్ణు కుండినులు వైష్ణవ మతాన్ని అధికంగా ఆదరించారు. వీరు శ్రీపర్వత స్వామిని కులదైవంగా స్వీకరించారు. వీరి లాంఛనం సింహం.

విష్ణుకుండినులు ఆలయాలతో పాటు ఇంద్రకీలాద్రి, మొగల్రాజపురం, ఉండవల్లి భైరవుని కొండల్లో గుహాలయాలను నిర్మించారు. అష్టభుజ నారాయణ స్వామి, త్రివిక్రమావతారం మొదలైన శిల్పాలు మొగల్రాజపురం గుహాలయాల్లో తొలిచారు. వీరు రాజ్యాన్ని రాష్ట్రాలుగా, విషయాలుగా విభజించారు. రాష్ట్రానికి అధిపతి రాష్ట్రీకుడు. విషయానికి అధికారి విషయాధిపతి. సైన్యంలో హస్తికోశుడు, వీరకోశుడు (పదాతిదళాధిపతి) ఉండేవారు.

చందవరం బౌద్ధస్తూపం ఏ జిల్లాలో ఉంది?

ఇక్ష్వాకుల పాలన, సామాజిక, మత సాంస్కృతిక వికాసం

ఇక్ష్వాకు రాజులు కొద్దికాలమే పాలించినప్పటికీ, వారి పాలన ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో ప్రసిద్ధికెక్కింది. శాతవాహనుల పతనాంతరం, ఇక్ష్వాకుల వంశస్థాపకుడు వాసిష్ఠీపుత్ర శ్రీఛాంతమూలుడు వైదిక ధర్మాన్ని పునరుద్ధరించాడు. ఇక్ష్వాకుల తర్వాత బృహత్పలాయనులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు కూడా వైదిక మతానికే ప్రాధాన్యమిచ్చారు. ఇక్ష్వాకు రాణులు, ఛాంతమూలుని కుమారుడు శ్రీవీరపురుషదత్తుడు, బౌద్ధమత ప్రాచుర్యానికి కృషిచేశారు. నాగార్జునకొండ, గురజాల, జగ్గయ్యపేటల్లో లభించిన వీరి ప్రాకృత శాసనాల ఆధారంగా గుంటూరు, కృష్ణా జిల్లాల్లో క్రీ.శ. 225-230 మధ్య కాలంలో రాజ్యాన్ని ఏర్పాటు చేశారని చెప్పొచ్చు.

పాలనా విధానం:

ఇక్ష్వాకుల కాలం నాటి పరిస్థితులను తెలుసుకోవడానికి వాఙ్మయం, శాసనాలు ముఖ్య ఆధారాలు. ఉదాహరణకు నాగార్జున కొండ శాసనాల్లో ఇక్ష్వాకు రాజులను సామ్రాట్, రాజన్, మహారాజుగా వర్ణించారు. ఇక్ష్వాకుల చివరి రాజైన రుద్రపురుషదత్తుడు మహారాజుగా వ్యవహరించినట్లు అతడి శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ అంశాల ఆధారంగా ఇక్ష్వాకు రాజులందరూ సర్వస్వతంత్రులుగానే పాలించినట్లు స్పష్టమవుతోంది. ఈ రాజుల భార్యలకు 'మహా దేవి' అనే బిరుదు ఉంది. ఇక్ష్వాకులు కొద్ది మార్పులతో శాతవాహన రాజుల పాలనా పద్ధతులనే అనుసరించారు. రాజ్యానికి సర్వాధికారి రాజు. ధర్మశాస్త్రాలను అనుసరించి పాలన సాగింది. యువరాజులు, మహాతలవరులు, మహాసేనాపతులు, మహాదండనాయకులు, అమాత్యులు రాజుకు సహాయకులుగా ఉండేవారు. యజ్ఞయాగాలు, అశ్వమేధ, రాజసూయ, వాజపేయ క్రతువుల ద్వారా రాజ్యాన్ని సుస్థిరపరుచుకున్నారు. ఇక్ష్వాకు వంశ స్థాపకుడు ఛాంతమూలుడు మహాసేనుని (కార్తికేయుడు) భక్తుడిగా, అగ్నిహోత్రాగ్ని అష్టోమాది క్రతువులు నిర్వహించారు.

ఇక్ష్వాకులు రాజ్యాన్ని 'రాష్ట్రాలు', శాలంకాయనులు 'విషయాలు', బృహత్పలాయనులు 'ఆహారాలుగా' విభజించారు. సామంతరాజులు భార్యలకు మహాతలవరి, 'మహాసేనాపతిని' అనే వంశపారంపర్య బిరుదులుండేవి. మహాదండ నాయకుడు సైన్యానికంతటికీ అధ్యక్షుడుగా ఉండేవాడు. ఆనాటి దేశ విభాగం గురించి అంతగా తెలీదు. జగ్గయ్యపేట శాసనం కమ్మక రథం లేదా కర్మరాష్ట్రం (కమ్మ రాష్ట్రం)గా పేర్కొంది. కడప-కర్నూలు ప్రాంతాలను 'హిరణ్యరాష్ట్రం'గా పేర్కొన్నారు.

గ్రామ పాలన:

ఐదేసి గ్రామాలను కలిపి గ్రామపంచికగా పిలిచే వారు. మహాగ్రామ అనే భూభాగం 'మహాగ్రామిక' అనే ఉద్యోగి అధీనంలో ఉండేది. రాజ్యానికి భూమిశిస్తు ముఖ్యాధారం. వ్యవసాయం ప్రధాన వృత్తి. పంటలో ఆరోవంతు పన్నుగా చెల్లించేవారు. భూమిపై రాజుకే సర్వాధికారం. వృత్తి పనివారు శ్రేణులుగా ఉండేవారు. పర్ణిక శ్రేణి (తమలపాకుల వారి సంఘం), పూసికశ్రేణి (మిఠాయిలు చేసేవారి సంఘం) ఉండేవి. వీటికి కులికప్రముఖుడు (శ్రేణి నాయకుడు) ఉండేవాడు. దేవాలయాలు, మంటపాల నిర్వహణ కోసం 'అక్షయనిధి' ఏర్పాటు చేశారు.

సమాజం:

ఆనాటి సంఘంలో వర్ణవ్యవస్థ పాతుకుపోయింది. బ్రాహ్మణులకు అధిక గౌరవం ఉండేది. బ్రాహ్మణు లకు అగ్రహారాలు, బ్రహ్మదేవాలు, గ్రామాలు, భూములను రాజులు బహుమతులుగా ఇచ్చేవారు. బ్రాహ్మణులకు శిక్షలు లేవు. వృత్తిపని వాళ్లు-శ్రేణులుగా ఏర్పడి వర్తక వాణిజ్యాలు చేసేవారు. వాఙ్మయం, శాసనాలు, నాటి సమాజ స్థితిగతులను తెలియజేస్తున్నాయి. బౌద్ధ, జైన, భాగవత మతాలు ప్రాచుర్యం పొందాయి. సంఘంలో స్త్రీలకు సముచిత స్థానం ఉండేది. ఇక్ష్వాకు రాజవంశ స్త్రీలైన ఛాంతిసిరి, కొడబలిశ్రీ, మహాభట్టిదేవిలు విహారాలు, చైత్యగృహాలకు విరివిగా దానధర్మాలు చేశారు. వివిధ వృత్తులు, పరిశ్రమలవాళ్లు, వర్తకులు కూడా బౌద్ధ విహారాలకు దానాలు చేశారు. అమరావతి, నాగార్జునకొండ ప్రాంతాలు ధార్మిక కేంద్రాలుగా, విద్యాపీఠాలుగా గుర్తింపు పొందాయి. ఛాంతమూలుడు వైదిక మతాభిమాని. వీరపురుషదత్తుడు బౌద్ధ మతాభిమాని. నాగార్జున కొండ శాసనాల్లో నిగమ, గోఠీ అనే పదాలు కన్పిస్తాయి. వాటిని వర్తకులు, వృత్తిపనులవారు ఏర్పరచుకున్న స్వయం పాలక సంఘాలని చెప్పొచ్చు. ఇక్ష్వాకు రాజ్యవంశ స్థాపకుడు ఛాంతమూలుడు ఆవులు, నాగళ్లు దానం చేసినట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. బ్రాహ్మణులకు గోవులు, వ్యవసాయదారులకు నాగళ్లు దానాలుగా ఇచ్చేవారు.

వర్తక వాణిజ్యాలు:

ఇక్ష్వాకుల కాలంలో విదేశీ వాణిజ్యం రోమన్ దేశంతో జరిపినట్లు తెలుస్తోంది. ఇందుకు నిదర్శనం అమరావతి, వినుకొండ, చేబ్రోలు, భట్టిప్రోలు, నాగార్జున కొండ ప్రాంతాల్లో రోమన్ బంగారు నాణాలు లభ్యమవ్వడమే. వ్యవసాయం, వర్తకం అభివృద్ధి చెందింది. తూర్పుతీరంలో ఘంటశాల, కొడ్డూర (గూడూరు), 'మైసోలియా' మచిలీపట్నం రేవు పట్టణాలుగా గుర్తింపు పొందాయి. పశ్చిమ తీరంలో బారుకచ్ఛ, కళ్యాణ్ సోపార రేవు పట్టణాలు ప్రధాన వర్తకరేవులుగా గుర్తింపు పొందినట్లు టోలమీ-భూగోళశాస్త్రం, అజ్ఞాతగ్రీకు రచయిత- 'పెరిప్లస్ ఆఫ్ ద ఎరిత్రియన్ సీ' లాంటి రచనల ద్వారా తెలుస్తోంది.

మత పరిస్థితులు:

ఇక్ష్వాకుల కాలంలో బౌద్ధంతో పాటు పౌరాణిక దేవతలనూ ఆరాధించే వారు. కార్తికేయ, శివ, అష్టభుజ స్వామి, మాతృదేవత ఆరాధన పెరిగింది. ధాన్యకటకం, నాగార్జున కొండ.. చైత్యకవాదులు, మహాసాంఘిక శాఖల భిక్షువులకు తీర్థ స్థానాలయ్యాయి. నాగార్జున కొండ మహాచైత్యం (స్తూపం) బౌద్ధులందరికీ ఆరాధ్య స్థానమైంది. ఇక్కడ అపరమహావిన శైలీయులు, బహుశ్రుతీయులు, మహిశాసకులు మొదలైన సంఘాల వారు నివసించేవారు. వీరే కాకుండా కాశ్మీర, గాంధార, తోసలి, అపరాంత, వంగ, సింహళ, తామ్రపర్ణి దేశాల నుంచి ధర్మ ప్రచారం నిమిత్తం నాగార్జునకొండకు వచ్చేవారు. అమరావతి చైత్యం (స్తూపం) చైత్యకీయ శాఖలకు, నాగార్జున కొండ అపర మహావిన శైలీయులకు ప్రధానకేంద్రాలుగా ఉన్నట్లు పాళీగ్రంథాల ద్వారా తెలుస్తోంది. బోధివృక్షం, బుద్దుని పాదాలు, త్రిరత్న, స్వస్తికా, ధర్మచక్రాలను ప్రజలు ఆరాధించేవారు. స్తూపాల ఆయకస్తంభాలపై బుద్ధుడి జీవిత ఘట్టాలను మలిచారు. బుద్ధుడి జననం, మహాభి నిష్క్రమణం, సంబుద్ధి, దర్మచక్ర ప్రవర్తనం, మహా పరినిర్యాణం ప్రధానమైన ఘట్టాలు. వీటినే పంచ మంగళాలు అంటారు.

నాగార్జునుడు, ఆర్యదేవుడు మహాసాంఘిక శాఖకు ప్రధానమైన తాత్వికులు. మాధ్యమిక వాదాన్ని పరిపుష్టం చేశారు. 'శూన్యవాదాన్ని' ఆచార్య నాగార్జునుడు, భావవివేకుడు, ఆర్య దేవుడు ప్రతిపాదించారు. 'బౌద్ధయోగాచార' సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ధర్మకీర్తి, ధిన్నాగుడు ఆనాటి వారే. 'ప్రమాణ సముచ్చయం' గ్రంథాన్ని ధిన్నాగుడు సంస్కృత భాషలో రచించాడు. 'సాంఖ్య సారికా' గ్రంథాన్ని ఈశ్వర కృష్ణుడు రచించాడు. ప్రాకృతభాష ఉన్నప్పటికీ, వైదికమతోద్ధరణ వల్ల సంస్కృత భాష విశేష రాజాదరణ పొందింది.

కట్టడాలు:

ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండ లోయ ప్రాంతం ప్రాచుర్యం పొందింది. రాజధాని 'విజయపురి' ఇక్కడిదే! ఇక్కడ బుద్ధుడి ధాతువుపై నిర్మించిన నాగార్జున కొండ మహాచైత్యం(స్తూపం) ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. 'భదంత ఆనందుడు' అనే భిక్షువు ఆధ్వర్యంలో నాగార్జున కొండ మహా చైత్యానికి శిల్పాల ద్వారా మరింత శోభను చేకూర్చారు. మహాదేవి కొడబలిశ్రీ, మహాదేవి భట్టిదేవి విహారాలు నిర్మించారు. ఉపాసిక బోధిశ్రీ భుమ్మ ధర్మగిరిపై చైత్యగృహం నిర్మించింది.

ఎహువల ఛాంతమూలుని కాలంలో శ్రీపర్వత విజయపురి ప్రాంతంలో పుష్పభద్రస్వామి, హారీతి, కార్తికేయుని ఆలయాల నిర్మాణం జరిగింది. ఎహువల ఛాంతమూలుని సేనాని 'ఎలిసిరి' సర్వదేవ ఆలయాన్ని నిర్మించాడు. నాగార్జున కొండలోని మిధున శిల్పాలు, జాతక కథల శిల్పాలు, యక్షీ వృక్షాలు; గోలిలోని వెస్సంతర జాతక శిల్పం; ఘంటశాలలోని మారధర్షణ దృశ్యం.. ఇక్ష్వాకుల ఉత్తమ శిల్పాలుగా చెప్పుకోవచ్చు. అమరావతి శిల్పంలో గ్రీకు సంప్రదాయ ఛాయలు కన్పిస్తాయి.

మాదిరి ప్రశ్నలు

1. 'మహాగ్రామిక' అనే పదం దేనికి ఉద్దేశించారు?
   ఎ) గ్రామోద్యోగి బి) నగర అధ్యక్షుడు
   సి) న్యాయపాలకుడు డి) తలారి
2. 'పర్ణికశ్రేణి' అంటే?
   ఎ) మిఠాయిలు చేసేవారి సంఘం
   బి) తమలపాకుల వారి సంఘం
   సి) సాలెవారి సంఘం డి) వర్తక సంఘం
3. పంచ మంగళాలు అంటే?
   ఎ) జైనసంఘాలు బి) శైవ మతశాఖలు
   సి) భాగవత మత శాఖలు
   డి) బుద్ధుని జీవిత ఘటాలు
4. బౌద్ధయోగాచార మత సిద్ధాంత కర్త ఎవరు?
   ఎ) భావ వివేకుడు బి) నాగార్జునుడు
   సి) ధర్మకీర్తి డి) ఆర్యదేవుడు
5. సంస్కృత భాషలో శాసనాలు వేయించిన ఇక్ష్వాకు రాజు?
   ఎ) ఛాంతమూలుడు బి) ఎహువలఛాంతమూలుడు
   సి) రుద్రపురుష దత్తుడు డి) వీరపురుష దత్తుడు
6. 'ప్రమాణ సముచ్ఛయం' గ్రంథ రచయిత?
   ఎ) నాగార్జునుడు బి) బుద్ధపాలితుడు
   సి) ధిన్నాగుడు డి) భావ వివేకుడు
7. సేతుబంధమనే ప్రాకృతకావ్యం, భావశతకమనే సంస్కృత కావ్యం ఏ రాజుల కాలంలో రచించారు?
   ఎ) శాతవాహన బి) వాకాటక
   సి) ఇక్ష్వాకు డి) విష్ణుకుండినుల
8. 'చందవరం బౌద్ధస్తూపం' ఏ జిల్లాలో ఉంది?
   ఎ) గుంటూరు బి) ప్రకాశం సి) కృష్ణా డి) నల్గొండ
9. కదంబుల రాజధాని?
   ఎ) మాన్యఖేతం బి) వైజయింతి
   సి) ఉజ్జయిని డి) వేంగి
10. 'శ్రమణులు' ఏ మతానికి చెందినవారు?
    ఎ) భాగవత బి) బౌద్ధ సి) శైవ డి) జైన
11. 'అజీవక' మత స్థాపకుడు?
    ఎ) బుద్ధుడు బి) గోసాలమస్కరిపుత్ర
    సి) బింబిసారుడు డి) మహావీరుడు
12. ఆంధ్రదేశంలో 'దేవరాష్ట్రమని' ఏ ప్రాంతాన్ని పేర్కొంటారు?
    ఎ) పిఠాపురం (తూర్పు గోదావరి)
    బి) వేంగీ (పశ్చిమ గోదావరి)
    సి) ఎలమంచిలి (విశాఖపట్నం)
    డి) రామతీర్థం (విజయనగరం జిల్లా)

సమాధానాలు

1	ఎ	2	బి	3	డి	4	సి	5	బి
6	సి	7	బి	8	బి	9	బి	10	డి
11	బి	12	సి						